క్లుప్తంగా

పోలేరమ్మకు అయ్యప్ప భక్తుల సలిమార



పానకాల కావిడను తీసుకువెళుతున్న అయ్యప్ప భక్తులు

పెనుమంట్ర: మండలంలోని మార్టేరు గ్రామంలో వేంచేసియున్న శ్రీపోలేరమ్మ అమ్మవారికి ఆదివారం అయ్యప్పస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో సలిమార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు సలివిడి, పానకాలు, చీర సారెలను తీసుకువెళ్లి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో గురుస్వాములు మల్లిడి రామకృష్ణారెడ్డి, అడబాల శ్రీనివాస్, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లం భాస్కరరెడ్డి, చిన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడి పూజ



పెనుగొండ: సిద్ధాంతంలో అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: అయ్యప్ప స్వామి పడిపూజా మహోత్సవం ఆదివారం రాత్రి భక్తి శ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. సిద్ధాంతం చౌదరీ రామాలయం వద్ద ఆచంట శ్రీరామచంద్రమూర్తి స్వామి, వీర రాఘవమ్మ దంపతులతో గురుస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కన్నెమూల మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వామి, మాళిగాపు రత్తమ్మలకు పూజలు నిర్వహించి, హరిహర సుతుడు అయ్యప్పకు అభిషేకాలు, పదునెట్టాంబడి పూజలు నిర్వహించారు.

పాలకొల్లులో..

పాలకొల్లు సెంట్రల్: స్థానిక పాలకొల్లు నరసాపురం రోడ్డులో పూలపల్లి బైపాస్ రోడ్డు వద్ద కొలువై ఉన్న శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామివారికి పడి పూజ నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో సినీ నిర్మాత గవర ఉదయ శ్రీనివాస్, కిరణ్మయి దంపతులు పాల్గొన్నారు. ఆలయ ప్రధానార్చకులు సుబ్రహ్మణ్య చైనులు గురుస్వామి బ్రహ్మత్వంలో ఆలయ వ్యవస్థాపకులు చల్లా బాబుల్ స్వామి ఆధ్వర్యంలో ఈ పడిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహించారు

సంపత్ వినాయక ఆలయ నిర్మాణానికి శ్రీకారం

పెనుగొండ: సిద్ధాంతం శివారు నక్కావారి పాలెంలో సంపత్ వినాయక స్వామి ఆలయానికి శ్రీకారం చుట్టారు. ఆదివారం ఇనపకోళ్ల ఆదినారాయణ దంపతులు, దార్లంక మారుతీ దంపతులు, పోలనాటి సత్తిబాబు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పితాని వెంకట్, సర్పంచ్ చింతపల్లి గనిరాజు(చంటి), ఉండవల్లి సత్యనారాయణ లక్కు వర్మ, నక్కా గణపతి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల భారం అన్యాయం



మాట్లాడుతున్న బి. బలరాం

యలమంచిలి: ట్రూ అప్ చార్జీల పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజలపై మోయలేని విద్యుత్ బిల్లుల భారం మోపడం అన్యాయమని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం విమర్శించారు. మండలంలోని చించినాడ గ్రామంలో ఉన్న అమరవీరుల స్మారక భవనం వద్ద ఆదివారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుమారు 17 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు బి.జార్జి, కవురు పెద్దిరాజు, మండల కార్యదర్శి కానేటి బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఎస్సీ వర్గీకరణ క్రిమిలేయర్ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ఏక సభ్య కమిషన్‌ను తక్షణమే రద్దు చేయాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు డిమాండ్ చేశారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, మాల సంఘాల గౌరవాధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు ఆధ్వర్యంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ పై ఏకసభ్య కమిషన్ నియమించే అధికారం ఏపీ రాష్ట్ర ప్రభుత్వానికి లేదన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 338 ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ ఎస్సీ కమిషన్ ఉన్నందున, దానిని వ్యతిరేకిస్తూ వేరు కమిషన్ నియమించడం రాజ్యాంగ విరుద్ధం అన్నారు. విశ్రాంత అధికారి రాజీవ్ రంజాన్ మిశ్రాను నియమించాడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

పనిచేయని రైతు నేస్తాలు

రైతు సేవా కేంద్రాల్లో కియోస్కులు నిరుపయోగం



సిద్ధాంతంలో నిరుపయోగంగా పడి ఉన్న కియోస్క్

పెనుగొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఉపయోగపడే సేవలను అటకెక్కించింది. ముఖ్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన రైతు భరోసా కేంద్రాలను అస్సలు పట్టించుకోవడం మానేసింది. అధికారంలోకి రాగానే ఆర్భాటంగా రైతు భరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చినా సేవలను మాత్రం గాలికి వదిలేసింది. దీంతో రైతు సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడానికి ప్రారంభించిన రైతు భరోసా కేంద్రాల లక్ష్యం నీరుగారిపోయింది. రైతుల ముగిటకు వ్యవసాయ శాఖ సేవలను తీసుకువెళ్లడానికి సాంకేతిక, శాస్త్రీయ పరిజ్ఞానాన్ని అందించేందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్బీకేలు ప్రారంభించి, ప్రతీ ఆర్బీకేలోనూ సూచనలు అందించడానికి కియోస్కులు ఏర్పాటు చేసింది. నాలుగేళ్ల పాటు విస్తృతంగా సేవలందించిన కియోస్కులు మూలకు చేరాయి. గతంలో రైతన్నలు పడ్డ పాట్లను తొలగించడానికి వైఎస్ జగన్ ప్రభుత్వం రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, నాణ్యమైన విత్తనాలు స్థానికంగానే ఎలాంటి కష్టాలు లేకుండా అందించడానికి వీటిని ఏర్పాటు చేసింది. కియోస్కుల సహాయంతో సాంకేతికంగా రైతులకు అవగాహన కల్పించడానికి ఎంతగానో ఉపయోగపడేవి. కాని, నేడు రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులు, పురుగు మందులు వంటివి అందించడం కూటమి ప్రభుత్వం నిలిపివేసింది. దీంతో వీటి ఉపయోగం లేకుండా పోవడంతో మూలకు చేరాయి. రైతులకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందుల ధరలు, రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు మార్కెట్ ధరలు, సమీపంలోని మార్కెట్ ధరలు కియోస్కుల ద్వారా రైతులకు తెలిసేవి. దీంతో పాటు వాతావరణ సమాచారం, మార్పులు, సీజనల్ పంటల వివరాలు, లాభసాటి సాగు అవసరమైన సూచనలు కియోస్కులు ద్వారా రైతులకు అందేవి. కియోస్కులను వినియోగించుకునేందుకు రైతులు కూడా ఆసక్తి చూపేవారు.

కోట్లాది రూపాయలు వృథా

ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర, పోడూరు మండలాల్లో 54 రైతు సేవా కేంద్రాల్లో కియోస్కులును గత ప్రభుత్వం ఏర్పాటు చేసింది. వీటిలో ఒక్కో కేంద్రంలో ఒక్కో కియోస్కుకు రూ.21.08 లక్షలు ఖర్చు చేసింది. ప్రస్తుతం వీటిని మూలకు చేర్చడంతో కోట్లాది రూపాయలు కూటమి ప్రభుత్వం వృథా చేస్తుందని పలువురు మండిపడుతున్నారు. రైతులకు అందించాల్సిన సేవలను నిర్లక్ష్యం చేస్తున్నారని, ఎన్నో ఉపయోగాలున్న కియోస్కుల ద్వారా రైతులకు సేవలను పునరుద్ధరించాలంటూ పలువురు డిమాండ్ చేస్తున్నారు.

కియోస్కులతో రైతులకు మేలు



గత ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన రైతు సేవా కేంద్రాల్లోని కియోస్కులుతో రైతులకు మేలు జరిగేది. ఎప్పటికపుడు సాంకేతికంగా సలహాలు అందించడంతో పాటు, ఎరువులు, పురుగుల మందుల ధరలతో బ్లాక్ మార్కెట్‌ను నిలువరించేవారు. నేడు వాటిని మూలకు చేర్చడం వలన రైతులకు తీవ్ర నష్టం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి కియోస్కులను తిరిగి అందుబాటులోకి తీసుకురావాలి.

– ఎస్ సుబ్రహ్మణ్యం, దేవ

అనుమతి లేని ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు తొలగిస్తాం

నరసాపురం: పట్టణంలో అనుమతులు లేకుండా కట్టిన ఫ్లెక్సీలు, ప్రకటన బోర్డులు తొలగించి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య చెప్పారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎవరికివారు ఇలాంటి బోర్డులు వెంటనే స్వచ్ఛందంగా తొలగించుకోవాలని సూచించారు. అలాగే అనుమతులు తీసుకుని కట్టిన బోర్డులు కూడా నిర్ణీతకాల వ్యవధిలో తొలగించాలని చెప్పారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో ఈ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నరసాపురం ఆర్డీవో దాసి రాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటలు నుంచి అందించాలని కోరారు.

ముత్యాలమ్మ ఆలయంలో భక్తుల కిటకిట



ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మను దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. కార్తీక మాసం సందర్భంగా బీచ్‌కు వెళ్లే వారు కూడా అమ్మవారి దర్శనానికి రావడంతో ఆలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగుకుండా ఆలయ ఈఓ ఎం.అరుణ్ కుమార్, ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాల రావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు

పాలకొల్లు సెంట్రల్: యునైటెడ్ కాపు వనిత క్లబ్ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం స్థానిక 12వ వార్డు లక్ష్మీటవర్స్ వద్ద చెవి, ముక్కు, గొంతు పరీక్షలు నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు కర్రె విజయ మాట్లాడుతూ గవర్నర్ మ్యాన్‌డేటరీ హెల్త్ ఈవెంట్స్‌లో భాగంగా ఈ వైద్య క్యాంపు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో క్లబ్ రీజనల్ చైర్మన్ మంగెన అరుణ, సెక్రటరీ దేవరపు కాంచనమాల, ట్రెజరర్ శిద్ధిరెడ్డి శైలజరాణి, అడబాల జ్యోతి, కూనపరెడ్డి విజయలక్ష్మి, కూనపరెడ్డి భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశాలు



సమావేశంలో వైస్ ఎంపీపీపై వాగ్వివాదానికి దిగిన పెదలంక సర్పంచ్



యలమంచిలి మండల పరిషత్ సమావేశంలో అధికారులను ప్రశ్నిస్తున్న బాడవ సర్పంచ్ భర్త

యలమంచిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం రసాభాసైంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ప్రోటోకాల్ వివాదం రావడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో సభాధ్యక్ష స్థానంలో ఉన్న వైస్ ఎంపీపీలతోపాటు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశాన్ని బహిష్కరించి కార్యాలయం కింద భాగంలో ఉన్న ఎంపీపీ చాంబర్‌లోకి వెళ్లిపోయారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వైస్ ఎంపీపీ గొల్లపల్లి శ్రీనివాసరావు అధ్యక్షతన ఆదివారం మధ్యాహ్నం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ప్రారంభమైంది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో ఎటువంటి తీర్మానాలు లేకుండా, కేవలం శాఖల వారీ సమీక్షతో సమావేశం ముగించాలని నిర్ణయించి, సమావేశం ప్రారంభించారు. ముందుగా వ్యవసాయాధికారి చిండులూరి దేవి, ఎంఈవో సుధాకర్‌లు తమ శాఖ పరిధిలో జరుగుతున్న పనులను వివరించారు. ఆ సమయంలో మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు కవురు గోపి మాట్లాడుతూ మన మండలానికి ఎంపీపీ ఎలాను లేదు, ప్రొటోకాల్ ఉన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు కూడా సమావేశానికి రాకపోతే మా సమస్యలు ఎవరికి చెప్పాలని ప్రశ్నించారు. కనీసం ప్రొటోకాల్ ఉన్న నాయకులకు సమావేశం నోటీసు పంపుతున్నారా అని అడుగుతుండగా, పెదలంక సర్పంచ్ తాళ్ల నాగరాజు కలుగజేసుకుని ఎమ్మెల్యే సమావేశానికి రావాలా? అంటూ దూసుకురావడంతో వాగ్వివాదం ప్రారంభమైంది. దీనిపై వేదిక మీద ఉన్న వైస్ ఎంపీపీ కొప్పాడి శ్రీనుబాబు మాట్లాడుతుండగా సర్పంచ్ తాళ్ల నాగరాజు నీకు సంబంధం లేదు అనడంతో వాగ్వివాదం పెరిగిపోయింది. కొంత సమయం ఎవరు ఏమి మాట్లాడుతున్నారో అర్థం కాకుండా వాగ్వివాదానికి దిగారు. వైస్ ఎంపీపీ స్థానంలో వేదిక మీద ఉన్న వ్యక్తిని నీకు సంబంధం లేదంటారా అంటూ నాగరాజు మాటలకు నొచ్చుకున్న వైస్ ఎంపీపీలు, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు.

సభాధ్యక్షుడు లేకపోయినా సమావేశం నిర్వహణ

వైస్ ఎంపీపీలు, వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు బయటకు వెళ్లిపోయినా సభాధ్యక్షుడు లేకపోయినా ఎంపీడీవో సమావేశం కొనసాగించారు. ఇదే అదనుగా సమావేశం మందిరం బయట కూర్చున్న తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన మహిళా సర్పంచ్, ఎంపీటీసీ సభ్యుల భర్తలు సమావేశ మందిరంలోనికి వచ్చి కూర్చున్నారు. అధికారులు వారిని వారించకపోవడంతో వారంతా సమావేశంలో అధికారులను ప్రశ్నించడం మొదలుపెట్టారు. ఆ సమయంలోనే సభాధ్యక్షుడు లేకుండా సమావేశం నిర్వహించడంపై ఎంపీడీవో ప్రేమాన్వితకు ఫోన్ రావడంతో ఆమె సమావేశం వాయిదా వేసి కిందకు వెళ్లి ఎంపీపీ చాంబర్‌లో ఉన్న వైస్ ఎంపీపీలు, వైఎస్సార్ సీపీ సర్పంచ్, ఎంపీటీసీ సభ్యులతో చర్చించారు. ఆ సమయంలో ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌కు సమావేశం నోటీసు పంపకపోవడంపై చర్చ జరిగింది. ఎంపీడీఓ స్పందిస్తూ కవురు శ్రీనివాస్ పీఏకు పీడీఎఫ్ ఫైల్‌లో నోటీసు పంపామని చెప్పడంపై సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ ఉన్న ఎమ్మెల్సీకి నోటీసు అందజేకుండా, కనీసం ఫోన్‌లో చెప్పకుండా పీడీఎఫ్ పంపుతారా అని సభ్యులంతా ఎదురుతిరిగారు. దీనిపై ఎంపీడీఓ స్పందిస్తూ మళ్లీ ఇటువంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకుంటానని హామినివ్వడంతో సభ్యులు శాంతించి సమావేశ మందిరంలోనికి వెళ్లడంతో సమావేశం కొనసాగింది.

పాలకొల్లులో సాదాసీదాగా..



మండల పరిషత్ సర్వ సభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ చిట్టూరి కనకలక్ష్మి

పాలకొల్లు అర్బన్: ఎందుకొచ్చిన పదవులు సంతకాలను పెట్టడానికి తప్ప తమ గ్రామానికి ఒక్క రూపాయి కూడా పని చేయించలేకపోయానంటూ గవరపేట టీడీపీ ఎంపీటీసీ సభ్యుడు దొడ్డి ధనలక్ష్మి అధికారుల వద్ద ఆగ్రహం వ్యక్తం చేసింది. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం ఆదివారం ఎంపీపీ చిట్టూరి కన కలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో అభివృద్ధి పనులపై చర్చ కొనసాగలేదు. సమావేశానికి సర్పంచ్‌లు, అధికారులు గైర్హాజరు కావడంతో కుర్చీలన్నీ ఖాళీగా కనిపించాయి. మండల పరిషత్ ప్రతిపక్ష నేత శాగ సత్యనారాయణ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు చాలా మంది కొత్తగా వచ్చారని, వారంతా ప్రజా ప్రతినిధులను సమన్వయం చేసుకుని పనిచేయాలని సూచించారు. సమావేశంలో చింత పర్రు సర్పంచ్ గుమ్మాపు పెద్దిరాజు మాట్లాడుతూ లో వోల్టేజీ ఉందని, గత సమావేశంలో ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని కోరినా ఇప్పటి వరకు వేయలేదన్నారు. వెలివెల సర్పంచ్ కందుల వెంకటేశ్వరరావు తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు వేయాలని కోరామన్నారు. ఈ సమస్యలను పరిస్కరించడానికి తక్షణ చర్యలు తీసుకుంటామని ఎలక్ట్రికల్ ఏఈ ఎల్.శ్రీనివాసరావు వివరణ ఇచ్చారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు పడవల సునీల్‌బాబు, కోఆప్సన్ సభ్యుడు తండా ఇస్సాక్‌రాజు, ఎంపీటీసీలు యాండ్ర లక్ష్మీకుమారి, సర్పంచ్‌లు రాపాక నగేష్ కరుణాకర్, దిడ్ల మణివజ్రం, గంటా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహం అందించాలి



మాట్లాడుతున్న రాయల్స్‌క్లబ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ

నరసాపురం: ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు ఆర్థిక ప్రోత్సాహం అందిస్తే వారు ఉన్నత లక్ష్యాలు చేరుకోగలుగుతారని రాయల్స్‌క్లబ్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ అన్నారు. ఆదివారం రాయల్స్‌క్లబ్ ద్వారా 200 మంది విద్యార్థులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయాన్ని స్కాలర్‌షిప్స్ రూపంలో అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చినిమిల్లి మాట్లాడుతూ రాయల్స్‌క్లబ్ ద్వారా ఆర్థిక ప్రోత్సాహం కరువైన కాపు విద్యార్థులను ఆదుకుంటున్నామని చెప్పారు. మరో ముఖ్య అతిథి తులసీసీడ్స్(గుంటూరు) చైర్మన్ తులసీరామచంద్రప్రభు మాట్లాడుతూ రాయల్స్‌క్లబ్ చేపట్టిన కార్యక్రమాన్ని కొనియాడారు. అనంతరం రాయల్స్‌క్లబ్ మహిళా విభాగం నరసాపురంశాఖ కార్యవర్గాన్ని నూతనంగా ఏర్పాటు చేశారు. అధ్యక్ష, కార్యదర్శులుగా వలవల సావిత్రి, కంబాల స్వర్ణ, ఉపాధ్యక్షురాలిగా పోలిశెట్టి నళిని ప్రమాణస్వీకారం చేశారు. వర్ధమాన హీరో ఉలిశెట్టి శ్రీనివాస్‌ను సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు జక్కం బాబ్జి, అందే రంగారావు, పోలిశెట్టి రఘురామ్, సలాది రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలపై పన్నుల భారం



కుంచిలపల్లి వినిస్టన్‌బాబు

పాలకొల్లు అర్బన్: పేదలపై పన్నుల భారం పెంచేందుకు జీఎస్టీపై 1శాం పన్ను పెంపునకు సీఎం చంద్రబాబు కేంద్రాన్ని అనుమతి కోరుతున్నారని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో పేదలు కొనుగోలు చేసిన ప్రతీ వస్తువుపైనా జీఎస్టీ పన్ను చెల్లించాల్సి వస్తుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వలంటీర్లపై అసత్య ఆరోపణలు చేసి వారి ఉసురు పోసుకున్న చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బాబు హాయంలో అమలయ్యే స్కీమ్‌లన్నీ స్కాములేనని ఆరోపించారు. సూపర్ సిక్స్ అమలు చేయడం చేతకాక ప్రశ్నించే వారిపై కేసులు పెడుతూ ప్రజల దృష్టిని మళ్లించడానికి ఎత్తులు వేస్తున్నారని మండిపడ్డారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



నరసాపురం: ఫైనల్ డయాగ్నసిస్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం



పెనుమంట్ర: విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సువర్ణగౌరి

నరసాపురం: 57వ గ్రంథాలయ వారోత్సవాలు నరసాపురంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని గ్రేడ్–1 శాఖా గ్రంథాలయంలో ఆదివారం ఉత్సవాల్లో భాగంగా సాహితీ దినోత్సవాన్ని నిర్వహించారు. రచయిత ఎం.సుగుణరావు రచించిన ఫైనల్ డయాగ్నసిస్ నవలపై పరిచయం కార్యక్రమం, సమీక్ష నిర్వహించారు. అల్లూరి సాంస్కృతిక కేంద్రం నిర్వాహకుడు బాబుశ్రీ, వ్యాఖ్యాత సీహెచ్ రెడ్డప్ప దవేజీలు పుస్తక సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో విద్యార్థులను కేవలం పాఠ్యపుస్తకాలు మాత్రమే చదవడానికి పరిమితం చేస్తున్నారని, ఇది ప్రమాదకర ధోరణిగా మారుతుందని వక్తలు చెప్పారు. గ్రంథాలయాల్లోని అన్ని రకాల పుస్తకాలు చదవేలా చేయాలని సూచించారు. క్రీడలు, సాంస్కృతిక, సాహిత్య అంశాలపై కూడా విద్యార్థులకు అవగాహన, ఉత్సాహం కలిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ కేజేఎల్‌ఎల్ కుమారి, ఎం.సుధీర్ బాబు, అల్లూరి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మార్టేరులో..

పెనుమంట్ర: ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి గంటపాటు పుస్తక పఠనం చేయాలని మానవత సంస్థ జిల్లా కన్వీనర్ కొత్త సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం మార్టేరు గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకుని చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల రామారెడ్డి అధ్యక్షత వహించగా మానవత పెనుమంట్ర మండల అధ్యక్షులు కర్రి కృష్ణారెడ్డి, ట్రెజరర్ చదువుల వెంకట రమణ, రిటైర్డు ఉపాధ్యాయులు పి.సువర్ణగౌరి, గ్రంథాలయ అధికారి పీటీఎస్ కుమార్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): పట్టణంలోని మావుళ్లమ్మ అమ్మవారి దేవస్థానంలో ఆదివారం అమ్మవారి మాలధారణ భక్తులచే ఆలయ ప్రధాన అర్చకులు మద్దిరాల మల్లికార్జున శర్మ అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. 400 మంది భక్తులు కుంకుమ పూజల్లో పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

భీమవరం అర్బన్: మండలంలోని భీమవరం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నరసింహపురం గ్రామంలో కోడి పందేల స్థావరంపై ఆదివారం ఎస్సై వీర్రాజు ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.2,800లు స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బంటుమిల్లి శ్రీనివాస్ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కార్తీక వనసమారాధనల జోరు



నరసాపురం రూరల్: మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబును సత్కరిస్తున్న దృశ్యం



పెనుమంట్ర: కార్తీక వనసమారాధనలో క్షత్రియ ప్రముఖులు

నరసాపురం రూరల్: విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని గౌడ, శెట్టిబలిజ కులస్తులంతా తమపిల్లలను చదివించాలని పలువురు నాయకులు పేర్కొన్నారు. కార్తీక మాసం సందర్భంగా గౌడ, శెట్టిబలిజ కులస్తులు ఆదివారం ఎల్బీచర్ల గ్రామంలో ఏర్పాటు చేసుకున్న కార్తీక వనసమారాధనలో పలువురు కుల ప్రముఖులు పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాజీ ఎమ్మెల్సీ మేకా శేషుబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ వీరవల్లి శ్రీనివాస్, భీమవరం, నరసాపురం జెడ్పీటీసీ కాండ్రుగుల నర్సింహారావు, బొక్కా రాధాకృష్ణ, వ్యాపార వేత్త పితాని వెంకట్ తదితరులు మాట్లాడుతూ కుల వృత్తులను ఆధునీకరించాలని, సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గుబ్బల నాగరాజు, కుక్కల మీరయ్య, దొంగ గోపి, గుబ్బల రాధాకృష్ణ, కంకటాల పెద్దిరాజు, కాండ్రేగుల నరసింహారావు పాల్గొన్నారు.

పెనుగొండలో..

పెనుగొండ: కార్తీక మాసం సందర్భంగా ఆదివారం ఆచంట నియోజకవర్గంలో కార్తీక వనసమారాధనలు జోరుగా సాగాయి. రెడ్డి కార్తీక వన సమారాధన పెనుగొండడలోని లక్ష్మీ జనార్ధన స్వామి కల్యాణ మండపంలోనూ, ఆచంట మండలం కొడమంచిలి, పెనుగొండ మండలం పెనుగొండ, పోడూరు మండలం గుమ్ములూరులో శెట్టిబలిజ గౌడ సంఘాల ఆధ్వర్యంలో వన సమారాధనలు జోరుగా నిర్వహించారు. పెనుగొండ చెరుకువాడ బ్రాహ్మణ సమాఖ్య ఆధ్వర్యంలో పెనుగొండలో ఘనంగా నిర్వహించారు. శెట్టిబలిజ, గౌడ వనసమారాధనల్లో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన వన సమారాధనలో శెట్టి బలిజ కార్పోరేషన్ చైర్మన్ కుడడిపూడి సత్తిబాబు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహనరావు,, పిల్లి సత్తిరాజు, వేండ్ర రాము, దొంగ నాగార్జున పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ కార్తీక వన సమారాధన

పెనుగొండలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో స్వర్ణోత్సవ వన సమారాధన వైభవంగా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన రెడ్డి ప్రముఖులను ఘనంగా సత్కరించారు. కార్తీక దామోదర పూజలు అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు.

పెనుమంట్రలో..

పెనుమంట్ర: క్షత్రియ వనసమారాధన ఆదివారం పెనుమంట్రలోని దాట్లవారి తోటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర గ్రామ రెవెన్యూఅధికారుల సంఘం అధ్యక్షులు భూపతిరాజు రవీంద్రరాజు, రాధాదేవి దంపతులు దామోదురినికి పూజలు జరిపారు. అనంతరం పిల్లలకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ దాట్ల రంగావతి, దాట్ల విశ్వనాథరాజు, గరువు గ్రామ సర్పంచ్ ముదునూరి నాగరాజు, పెనుమంట్ర ఉపసర్పంచ్ భూపతిరాజుశ్రీనివాసరాజు, పెనుగొండ ఏఎంసీ మాజీ డైరెక్టర్ గాదిరాజు సాయిరామరాజు తదితరులు పాల్గొన్నారు.